వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 91 బుధవారం | 04 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

# ఐక్యత కాపాడుకుందాం..




పలువురు వక్తల అభిప్రాయం

ఘనంగా ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావం




# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు




# టెంపుల్ టూరిజంగా ఓరుగల్లు

మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

విలేకరుల సమావేశంలో వినయ్ భాస్కర్

## దమ్ముంటే

# కేయూలో పర్యటించాలి

మంత్రి కేటీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి సవాల్







# 'గులాబీ'లకే గృహలక్ష్మి

GRUHALAKSHMI

గృహలక్ష్మి

## గ్రామాల్లో 'ముగ్గు' రాజకీయం



- లీడర్ల చేతిలో మారుతున్న తలరాతలు
- ఫైనల్ లిస్టు పెట్టకముందే పనులు
- అంతా ముందే ఫిక్స్ అంటూ విమర్శలు
- నియోజకవర్గానికి మూడు వేల కేటాయింపులు
- పరకాలలో దరఖాస్తులు 13 వేలు

గృహలక్ష్మి పథకంలో 'ముగ్గు' రాజకీయం ముదురుతోంది. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం పైరవీ దారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అర్హుల జాబితా బయటకు రాకముందే ఊళ్లల్లో పలువురితో ఇండ్లకు ముగ్గులు పోయిస్తున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు ముఖ్య అతిథులుగా హాజరై హంగామా సృష్టిస్తున్నారు. మనోడైతే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యే ఆదేశాలతో గృహలక్ష్మికి అర్హత పొందుతున్నారు. దీంతో అంతా ముందే ఫిక్స్ అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లీడర్ల చేతుల్లోనే లబ్ధిదారుల తలరాతలు మారుతున్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కోసం అమలు చేస్తున్న 'గృహలక్ష్మి' అర్హులకు కాకుండా అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నోళ్లకే దక్కుతున్నాయనే ప్రచారం సాగుతోంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

వివరాలు 2లో..

# ‘గులాబీ’లకే గృహలక్ష్మి



**గ్రామాల్లో ‘ముగ్గు’ రాజకీయం**
**లీడర్ల చేతిలో మారుతున్న తలరాతలు**
**ఫైనల్ లిస్టు పెట్టకముందే పనులు**
**అంతా ముందే ఫిక్స్ అంటూ విమర్శలు**
**నియోజకవర్గానికి మూడు వేల కేటాయింపులు**
**పరకాలలో 13 వేల దరఖాస్తులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. సొంత స్థలం కలిగి ఉండి ఇళ్లు లేని వారికి గృహ నిర్మాణం కోసం రూ.3లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా అందజేయనుంది. దీనికోసం ఒక్కో గ్రామం నుంచి వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేవలం పదుల సంఖ్యలో ముగ్గులు పోసుకోవడంతో మిగిలినవాళ్లు షాక్ కు గురువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ ప్రకారం ఇంకా ఫైనల్‌లిస్టు రాకముందే బీఆర్ఎస్ లీడర్లు ముగ్గులు పోయించడాన్ని బట్టి చూస్తే అర్హుల ఎంపిక అంతా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గ్రామానికి 20మందే..

గృహలక్ష్మి పథకాన్ని రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో మూడు వేల మంది అర్హులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా దరఖాస్తులను ఆహ్వానించారు. కేవలం మూడు రోజులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినప్పటికీ ఒక్కో నియోజకవర్గంలో 50వేల పైచిలుకు దరఖాస్తులు అందాయి. అదే విధంగా పరకాల నియోజకవర్గంలో 13వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఈ లెక్కన ఒక్కో నియోజకవర్గంలో 6మండలాలు.. ఒక్కో మండలంలో 25 గ్రామాల చొప్పున లెక్క వేసుకున్నా ఒక ఎమ్మెల్యే పరిధిలో సుమారు 150గ్రామాలు వస్తాయి. ప్రభుత్వం చెప్పినట్లు మొదటి విడతలో నియోజకవర్గానికి 3వేల మందికి ఇచ్చినా ఒక్కో గ్రామానికి 20మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం ద్వారా లబ్ధి చేకూరే అవకాశం ఉంటుంది.

### పారదర్శకతకు పాతర..

రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో అర్హుల ఎంపికను పారదర్శకంగా చేయనున్నట్లు ప్రకటించినా అది నీటి మీద మాటలుగా మారాయి. ఎట్టి పరిస్థితుల్లో పైరవీలకు అవకాశం ఉండదంటూ అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పలు మార్లు ప్రకటించారు. ఈ మేరకు నిరుపేదలను ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం గృహలక్ష్మి అర్హుల ఎంపిక జిల్లా ఉన్నతాధికారుల చేతుల్లో కాకుండా ఎమ్మెల్యేల చేతుల్లోనే ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

### లిస్ట్ రాక ముందే ముగ్గులు..

ఒక్కో గ్రామం నుంచి గృహలక్ష్మి కోసం అప్లై చేసుకున్నవారి లిస్టులను అధికారులు ఆఫీసుల్లో అంటించారు. పూర్తి వెరిఫికేషన్ అయ్యాక ఫైనల్ లిస్ట్ ఇస్తామని చెబుతున్నారు. ఇందుకు పది మందితో ఒక టీంనుకూడా ఏర్పాటు చేశారు. ఇందులో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఏవోలు సభ్యులుగా ఉన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వందలాది గ్రామాల్లో గృహలక్ష్మి పథకంలో ఎమ్మెల్యే చెప్పాడని బీఆర్ఎస్ లీడర్లు దగ్గరుండి మరీ పలువురితో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయిస్తున్నారు. గ్రామ, మండల స్థాయి లీడర్లు అక్కడకు వచ్చి కొబ్బరికాయలు కొడుతున్నారు. లబ్ధిదారులతో ఫొటోలు దిగి వీడియోలు తీసుకుని మండలంలోని అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పంపుతూ ప్రచారం చేసుకుంటున్నారు.

### బీఆర్ఎస్ కార్యకర్తలకే గృహలక్ష్మి..

గృహలక్ష్మి పథకం కింద అర్హులను మాత్రమే ఎంపిక చేస్తామంటూ బాహాటంగా చెప్పిన అధికారులు చివరికి అధికార పార్ట నాయకుల సూచనల మేరకే లబ్ధిదారులు ఎంపిక చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
అధికార పార్టీ కార్యకర్తలకే గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తున్నట్లు విమర్శిస్తున్నారు. నిరుపేదలు, అర్హులకు దక్కలేదని సామాన్య ప్రజానీకం మండిపడుతున్నారు. కార్యకర్తలకే పథకం ఇస్తూ వారికే ముందస్తుగా ముగ్గులు పోయడంతో ఈ విమర్శలకు బలం చేకూరుతోంది.. దీంతో ఏ పథకమైనా బీఆర్ఎస్ కార్యకర్తలకే ముందుకు చేరుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే ఆదేశం మేరకే 15 నుంచి 20 మందికి గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల ఇంటికి ముగ్గు పోసినట్లు సమాచారం ఇస్తున్నారు. అధికారులు తుది లిస్టు ప్రకటించకు ముందే ఎమ్మెల్యే ఓకే చేశాడనే పేరుతో బీఆర్ఎస్ లీడర్లు ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోస్తుండడంతో ముందే మ్యాచ్ ఫిక్స్ జరిగిందన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఎన్నికల ముందు డ్రామా..

**- మార్త భిక్షపతి, బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు**



ఎన్నికల ముందే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంతో నిరుపేదలకు ఎలాంటి ప్రయోజనం లేదు. కానీ, అంతిమంగా ప్రయోజనం మాత్రం బీఆర్ఎస్ కార్యకర్తలకే దక్కుతుంది. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అధికార పార్టీ కార్యకర్తలకే గృహలక్ష్మి పథకం వర్తింపజేసి ఆ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం ఎన్నికల కోసం కాకుంగా నిరుపేదలకు, అర్హులకు లబ్ధి చేకూరేలా పథకాలను అమలు పరచాలి.

### రూ. 5 లక్షలు ఇవ్వాలి



**- కొయ్యడ శ్రీనివాస్, పరకాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు**

గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు రూ. 5లక్షలు అందించాలి. పార్టీలతో పని లేకుండా గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికీ అందించి న్యాయం చేయాలి. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకులు తమకు తెలిసిన వారికే గృహలక్ష్మి పథకం వర్తింపజేసి ముగ్గులు పోసుకున్నారు. కేవలం ఎన్నికల ముందుకు ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం ఈ స్కీమ్ మెదలు పెట్టింది. బీఆర్ ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఎన్నికల తర్వాత గృహలక్ష్మి పథకాన్ని ఎత్తేసి ప్రజలను ఆగం చేస్తారు.

# మంత్రి సభకు భారీ ఏర్పాట్లు

## పరిశీలించిన తూర్పు ఎమ్మెల్యే నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 6న వరంగల్ తూర్పు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న సంక్షేమ సభ ఏర్పాట్లను డీసీపీ భారీ, ఆర్డీవో, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు.

### జోరుగా అభివృద్ధి పనులు..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు వద్ద రూ.4కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజి, ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కొబ్బరికాయ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కనివిని ఎరగని రీతిలో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. రూ.4,100 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి పథాన పయనిస్తోందన్నారు. 38వ డివిజన్లో రూ.4కోట్ల నిధులతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని సుమారు 15 వేల మందికి సంక్షేమ పథకాల ఫలాలు అందించబోతున్నామన్నారు. ఖిలా వరంగల్ లోని గ్రౌండ్ లో నిర్వహించనున్న ఈ సంక్షేమ సభకు ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బలపరుస్తూ తనని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కు బహుమతిగా అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో పాటు డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, వివిధ కాలనీల పెద్దలు, మహిళా నాయకులు, దేవాలయ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



# పోస్టల్ ఉద్యోగుల సమ్మె విజయవంతం

## స్తంభించిన గ్రామీణ తపాల సేవలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తమను రెగ్యులరైజ్ చేయడంతోపాటు 8 గంటల పని అమలు చేయాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం సెంట్రల్ జాయింట్ ఆక్షన్ కమిటి పిలుపు మేరకు బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఒక్క రోజు ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. ఐదు జిల్లాలలోని గ్రామీణ తపాల ఉద్యోగులు తరలి వచ్చి సమ్మెను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలు నిలిచిపోయాయని గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం, హనుమకొండ పోస్టల్ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ బొడ్డున వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమకొండ పోస్టల్ డివిజనల్ ఆఫీసు ఎదుట నిర్వహించిన సమ్మె శిబిరంలో వందలాది గ్రామీణ తపాల ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలేష్ చంద్ర జీడీఎస్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేసి తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించకపోతే డిసెంబర్ 5వ తారీఖు నుంచి దేశ వ్యాప్తంగా గ్రామీణ తపాల ఉద్యోగులు నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మర్రి కొమురారెడ్డి, కేంద్ర ప్రభుత్వాన్ని తపాలాశాఖను హెచ్చరించారు.

# పండుగలు తెలంగాణ ఔన్నత్యానికి ప్రతీకలు

## జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని రాకేష్



**వరంగల్ వాయిస్, కాటారం:** పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలు తెలంగాణ ఔన్నత్యానికి ప్రతీకలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిని రాకేష్ అన్నారు. బుధవారం కాటారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్ పర్సన్ శ్రీహర్శిని రాకేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్క మహిళలకు చీరలను అందించే కార్యక్రమాన్ని చేపట్టి ఆదర్శ ప్రాయుడయ్యాడని అన్నారు. ఇంటింటా సౌభాగ్యవతి కలకలాడుతూ ఉండాలనే ఆకాంక్షతో సీఎం కేసీఆర్ ప్రతి ఇంట అనేక రకాల 'బంధు' పేరిట పథకాలను చేపడుతున్నారని ఆమె వివరించారు. పేద ప్రజానీకానికి పెన్నిధిగా ఉంటున్న భారత రాష్ట్ర సమితి తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి కేసీఆర్ విజయ ఢంకా మోగిస్తారని ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల పరిషత్ అధ్యక్షుడు పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు తోట జనార్ధన్, జాడి మహేశ్వరి, సర్పంచ్ తోట రాధమ్మ, ఎంపీడీవో బానోత్ శంకర్ నాయక్, తాసిల్దార్ నాగరాజు, పంచాయతీ రాజ్ ఆర్ డబ్ల్యూఎస్ ఏఈలు అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సాయం



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన సొప్పరి శ్రావణ్ తండ్రి సొప్పరి ఐలయ్య మరణించిన విషయం తెలుసుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తన వంతుగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్త సత్తి రెడ్డి, కావటి మల్లేష్, రాజోజు నర్సింహ చారి, నరేందర్ పాల్గొన్నారు.

## లఖింపూర్ ఖేరీ ఘటనపై ప్రజా సంఘాల నిరసన



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డేని నిర్వహించి నిరసన తెలియజేశారు. ప్రజాసంఘాల నాయకులు పెరుమాండ్ల తిలక్, ఇసంపెల్లి సైదులు పాల్గొని మాట్లాడుతూ లఖింపూర్ కేరీలో నలుగురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు అశీష్ కుమార్ మిశ్రాపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, రైతాంగానికి మద్దతు ధర కల్పించాలని, ఎం ఎస్ పీ రైతులకు ప్రధాన మంత్రి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేని ప్రభుత్వం మోడీ ప్రభుత్వాన్ని, కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలంగా వ్యవహరిస్తున్న బీజేపీని రానున్న కాలంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు, విద్యార్థి, మేధావులు మహిళలు, ప్రజలు చైతన్యమంతమై గద్దె దించుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, రవి, దేవ్ సింగ్, హమాలి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కుటుంబ సభ్యులను మంగళవారం సాయంత్రం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి పరామర్శించారు. నూర్జన్ పల్లి గ్రామంలో రాంపంల్లి చంద్రయ్య, గట్ల కానిపర్తి గ్రామంలో గుర్రం సరోజన, జంగిలి కట్టమ్మ, సుద్దాల స్వరూపలు మృతిచెందగా మృతుల కుటుంబ సభ్యులను చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించారు. అదే విధంగా పత్తిపాక గ్రామంలో చెన్న రాంనారాయణ కాలికి శాస్త్ర చికిత్స జరగగా వారిని పరామర్శించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం రమేష్, నాయకులు రాయరాకుల మొగిలి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి భారీగా బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సమక్షంలో హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉండడమే కాకుండా వారిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటుందని అన్నారు. అందరం కలిసి కట్టుగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బత్తిని రాజు, కొలుకొండ ప్రభాకర్, ఉడుగుల సంపత్, బూడిది ఉప్పలయ్య, జవ్వాజి రాములు, కాకర్ల రాజు, కాకర్ల యాకయ్య, కాకర్ల ఎల్లయ్య, ఎండీ యాకుబ్ పాషా, ఎండీ శభాషా, ఎండీ మదర్, ఎండీ శాన్ పాషా, ఎండీ యాకుబ్, చిదుముళ్ల భిక్షపతి, శంఖేపెల్లి తిరుపతి చారి వీరితో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపి అన్నమనేని అప్పారావు, స్థానిక ఎంపీటీసీ ఉమాదేవి, మార్కెట్ డైరెక్టర్ రవీందర్ రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూరారం నిరంజన్, ల్యాబర్తి ఉపసర్పంచ్ కళింగా రావు, గ్రామపార్టీ అధ్యక్షులు గుడికందుల రాజు, చిక్కొండ యకయ్య, బత్తిని రాజబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'హైస్కూల్ ఇంగ్లీష్ గ్రామర్' పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక రెడ్డి కాలనీ ప్రోగ్రెస్ హైస్కూల్ లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ నాగరాజు ముదిరి రచించిన "హై స్కూల్ ఇంగ్లీష్ గ్రామర్" పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఆర్ మేఘన రావు, డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, విశిష్ట అతిథులుగా హనుమకొండ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీ రామ్ కిషన్ రాజు,పీటీసీ వరంగల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బానోతు కాశీరాం, ప్రోగ్రెస్ హై స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, ప్రోగ్రెస్ పాఠశాల డైరెక్టర్ శ్రీ మల్లాడి ఆశీష్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ హై స్కూల్ ఇంగ్లీష్ గ్రామర్ ఆరు నుంచి పది తరగతులకే కాకుండా కాంపిటేటీవ్ ఎగ్జామ్స్ కు కూడా పనిచేస్తుందని తెలిపారు. వాటికి అనుగుణంగా చాలా చక్కగా గ్రామర్ బిట్స్ పొందుపరచాడని పేర్కొన్నారు. అన్ని అంశాలను క్రోడీకరిస్తూ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. పుస్తక రచయిత నాగరాజు ముదిరిని మరిన్ని విషయాలతో విద్యార్థుల జీవితాలను వెలుగులోకి తీసుకొచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ మంత్రి షబ్బీర్ అలీలను ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో చోటు కల్పించడం పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య మాట్లాడుతూ హైదరాబాద్ తుక్కుగూడ విజయభేరి సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ప్రకటించిన 6గ్యారంటీలు చూసి కేసీఆర్ సర్కార్ కు భయం మొదలైందని అందుకే కేటీఆర్, హరీష్ రావు అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మిస్తామని ఇంటికో ఉద్యోగం ఇస్తామని అన్ని వర్గాల ప్రజలను ఉద్యమకారులను సైతం మోసం చేసింది కేసీఆర్ అని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో సీనియర్ ఉపాధ్యక్షుడిగా బండి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శులుగా కౌన్సిలర్ భూక్య శ్రీను, గండు కార్తీక్ గౌడ్, కార్యదర్శులుగా బండారు చిరంజీవి, మాలోత్ సురేష్, గుగులోత్ రాందాస్, వేల్పుల విష్ణు వర్ధన్, పిల్లి కృష్ణ, తోట వెంకన్న యాదవ్, షేక్ సలీం, ఆవుల సతీష్ తథితరులకు నియామక పత్రాలు మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య, మాజీ పీసీసీ సభ్యులు రాష్ట్ర మైనారిటీ నాయకులు చాంద్ పాషా, ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పింద్రాల్ల రాందాస్, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్, మాజీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నర్సింగ శ్రీనివాస్ యాదవ్, రామరాజు ఉపేందర్ పటేల్, సామ రాజవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి అందజేశారు. మహబూబాబాద్ అర్బన్ పరిధిలోని 36వార్డులలో రాబోయే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా కార్యాచరణతో అందరి సహకారంతో ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు.

# సీఎం కేసీఆర్‌ను చూస్తే ప్రతిపక్షాలకు వణుకు

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు వణుకు పుడుతున్నదని, రానున్న రోజుల్లో మాకు పుట్టగతులు ఉండవని భయపడుతున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు అన్నారు. బుధవారం సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామంలో రూ.1 కోటి 38 లక్షల నలభైవేల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతివనం, అంతర్గత సీసీ రోడ్లు, డంపింగ్ యార్డ్ ను ప్రారంభించి, పీడబ్ల్యూ డీ రోడ్డు నుంచి కుంటపల్లి వరకు నూతన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెట్టారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాల గుండెల్లో వణుకు పడుతుందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అడ్రస్ గల్లంతవ్వడం ఖాయమని పేర్కొన్నారు. మోసపూరిత మాటలతో గ్రామాల్లో తిరగడానికి వస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను తెలంగాణ ప్రాంతానికి ఏంచేశారో చెప్పాలని నిలదీయాలని ప్రజలను కోరారు. కుంటపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామ పొలిమేరలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ లపై ర్యాలీగా వస్తు గ్రామంలోని అన్ని కాలనీలు తిరుగుతూ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

### బతుకమ్మ చీరలు పంపిణీ..

తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు అందిస్తున్న బతుకమ్మ కానుకలను(చీరలు) సంగెం మండలం వంజరపల్లి గ్రామంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పంపిణీ చేశారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తూ, వారికి అండగా నిలిచి, వారి ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతు బంధు కన్వీనర్లు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ వర్ధన్నపేట నగర కార్యదర్శిగా శివమణి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా వర్ధన్నపేట శాఖ నూతన నగర కమిటీ వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట.హర్ష వర్ధన్ పాల్గొని నగర కమిటీ వేశారు. ఈ కమిటీలో నూతన అధ్యక్షుడిగా హరిబాబు ను, నగర కార్యదర్శిగా శివమణిని నియమించారు. ఈ సందర్భంగా శివమణి మాట్లాడుతూ తను బాల్యం నుంచి ఆర్ఎస్ఎస్ సంఘ్ శాఖకు వెళ్లి తనలో జాతీయ భావాలను నింపుకొని జాతి పునర్నిర్మాణకై కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, ఏబీవీపీ నాయకులు కార్తీక్, అజయ్, సాయి, నాగరాజుపాల్గొన్నారు

# బీజేపీ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** పెంచికలపేట గ్రామంలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటికొక ఉద్యోగం ఇస్తానని చెప్పి గద్దెనెక్కిన తర్వాత ముఖ్యమంత్రి తన కుటుంబంలో మాత్రం నలుగురికి ఉద్యోగ అవకాశాలు కల్పించుకున్నారని మండిపడ్డారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి తదితర ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇస్తున్నారని ఈ సందర్భంగా విమర్శించారు. నిరుద్యోగులంతా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పి భారతీయ జనతా పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఓబీసీ జిల్లా కార్యదర్శి, గ్రామ ఇంచార్జి సముద్రాల రవి, బీజేపీ జిల్లా కార్యదర్శి మోలుగూరి శ్రీనివాస్, ఓబీసీ మండల అధ్యక్షుడు వెల్తే సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, బూత్ అధ్యక్షులు ఇలసరపు రత్నాకర్, మంగ మల్లికార్జున్, పులికొండ వెంకటేశ్వర్లు, కందకట్ల సదానందం, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత ఏడు రోజులుగా మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న నేటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కాబట్టి పశ్చిమ ఎమ్మెల్యే చొరవ చూపి ముఖ్యమంత్రితో మాట్లాడి మా సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యునియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు బోట్ల చక్రపాణి వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ గత 18నెలలుగా చాలీచాలని వేతనం నెలకు రూ.1000 జీతంతో పనిచేస్తున్నామని, అనేక పోరాటాల ఫలితంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో 2022 మార్చి లో రూ.2000 రూపాయల జీతం పెంచుతున్నట్లు ప్రకటించి ఆ పెరిగిన జీతం కూడా నేటికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వంట నిర్వాహాన కోసం ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రితో మాట్లాడి మా సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సమస్యల పరిష్కారానికి మా వంతు కృషి చేస్తామని తెలిపారు..

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మ, శాంత, పర్వినా, సంధ్య, లక్ష్మీ, సరోజ, హైమా, రజిత, సుల్తానా, శారద, రమ, శ్రీవాణి, సమత, పుష్పలీల ,స్వప్న, సరళ, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్ట్ తుది జాబితా విడుదల

**వరంగల్ వాయిస్, మల్హర్ :** రెండో ఎస్ఎస్ఆర్ 2023లో భాగంగా మంథని అసెంబ్లీ నియోజక వర్గంలోని మల్హర్ మండల ఓటర్ల తుది జాబితాను బుధవారం మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్టు తహశీల్దార్ వై.శ్రీనివాసులు తెలిపారు. తుది జాబితా ప్రకారం మండలంలో 21168 మంది ఓటర్లు ఉండగా అందులో 10441 మంది పురుషులు, 10727 మంది స్త్రీలు ఉన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు కల్పించడం జరిగిందని, మండలంలోని ఓటర్ లు తమ పేరు, ఇతర వివరాలను సంభందిత బూత్ లెవల్ అధికారుల వద్ద తెలుసుకోవచ్చని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# 6న మల్హర్ మండల సర్వసభ్య సమావేశం

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మల్హర్ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6 శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో నరసింహ మూర్తి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# భిక్షాటన చేసిన ఆశా కార్యకర్తలు



**వరంగల్ వాయిస్, కాటారం :** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు రోజు రోజుకు తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో బుధవారం భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. 10 రోజులుగా చేపడుతున్న కార్యక్రమం పట్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల ఆశా కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే ఆమోదించాలని లేకుంటే రానున్న రోజుల్లో పూర్తిగా సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగస్వామ్యం కావలసి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు.

# క్రీడాకారులను అభినందించిన సాట్ చైర్మన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన క్రీడాకారులను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ అభినందించారు. బుధవారం హనుమకొండలో జరిగిన సమావేశంలో ఇటీవల జరిగిన రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన హనుమకొండ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ యువజన కీరాభివృద్ధి అధికారి గుగులోతు అశోక్ కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణం ఫాతిమా నగర్ లోనీ బిషప్ బరెట్ట పాఠశాలలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉత్తర్వుల మేరకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోజరాజు, కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ కె.సుజాత, ఎస్సై ఆర్.రామారావు, ఫాతిమా బిషప్ బరెట్ట పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం బిషప్ బరెట్ట పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోజరాజు, సీఐ సుజాత మాట్లాడుతూ పిల్లలు ఎట్టి పరిస్థితులలో మైనర్ డ్రైవింగ్ చేయకూడదని, మైనర్ డ్రైవింగ్ చేసి పోలిసులకు పట్టుబడితే పేరెంట్స్ కు జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. పేరెంట్స్ డ్రైవింగ్ చేసే సమయంలో టూ వీలర్స్ హెల్మట్ పెట్టుకోవాలని, ఫోర్ వీలర్లు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సూచనలను పిల్లలు, వారి పేరెంట్స్ తప్పకుండా పాటించే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా బిషప్ బరెట్ట పాఠశాల 300మంది విద్యార్థులు, యాజమాన్యం ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేస్తున్నారు. అందులో భాగంగా 20వ డివిజన్ లో కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఆధ్వర్యంలో నన్నపునేని నరేందర్ తిలక్ రోడ్ లో రూ.30లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం బీఎన్ రావు కాలనీ కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులు రూ.18.50 లక్షలతో, కాశిబుగ్గ ట్యాంక్ నుంచి తిలక్ రోడ్డు బొమ్మ వరకు రూ.18.10లక్షలతో సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేందర్ మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి డివిజన్ అధ్యక్షుడు మమ్మద్ ఇగ్బాల్, బీఆర్ఎస్ నాయకులు చిమ్మని శివ, సంతోష్, చిమ్మని వేముల నాగరాజ్, సోను చిమ్మని వేణు పల్లకొండ హరికుమార్, నటరాజ్, వివిధ డివిజన్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల నినాదంతో గడపగడపకు కాంగ్రెస్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల కరపత్రాలను గడపగడపకు అందజేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100రోజులలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం ఏకకాలంలో కాంగ్రెస్ గ్రామ శాఖల ఆధ్వర్యంలో రెండవ రోజు గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు. అనంతరం ఆయన కొప్పుల జోగంపల్లి గ్రామాలలో గ్యారెంటీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి గ్యారెంటీ కార్డులు పంపిణీ సందర్భంగా ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై అపూర్వ స్పందన వస్తుందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్త గ్రామంలోని ప్రతి ఇంటికి కాంగ్రెస్ గ్యారంటీ కార్డును చేరవేయాలన్నారు. ఓట్ల ముందు ప్రలోభాలు పెట్టే బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మవద్దని, పేద ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు ఎండీ వలి హైదర్, వైనాల కుమారస్వామి, మామిడిపల్లి సాంబయ్య, మారపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, తడుక కుమారస్వామి, మారపల్లి రాజు, రవిపాల్, మిట్టపల్లి సతీష్, వెంకట రాజిరెడ్డి, పల్లెబోయిన శ్రీనివాస్, ఏరుకొండ శంకర్, కౌటం లక్ష్మీనారాయణ, చంద్రమౌళి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్, జిల్లాస్థాయి క్రీడోత్సవాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను షీల్డులు, సర్టిఫికెట్లతో హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు సత్కరించారు. జోనల్ క్రీడోత్సవాలలో అండర్ 17 ఖోఖో గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 17 కబడ్డీ గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 14 బాయ్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 14 ఇయర్స్ ఖోఖో గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానం ఉప్పరపల్లి విద్యార్థులు సాధించారన్నారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రీడలలో నెక్కొండ, చెన్నారావుపేట జోన్ తరపున ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నిక్సన్, స్పందన, శిరీషలను కూడా అభినందించారు. వీరు పాల్గొన్న అండర్ 17 ఖోఖో బాయ్స్, అండర్ 17 ఖోఖో గర్ల్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా ముందంజలో ఉండాలని, మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కూడా దృఢంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులను అత్యున్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పీఈటి రవీందర్ ను అభినందించారు. అభినందన కార్యక్రమంలో హెచ్ఎం టి జయతోపాటు ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ ,శశిధర్ , పిన్నింటి బాలాజీ రావు, వేముల మమత, సీహెచ్ మాధవి, కె.మాధవి, తలకోటి మురళి, కె.మోహన్ రావు, ఓ.కృష్ణ, క్రాఫ్ట్ టీచర్ ఇందిర, జూనియర్ అసిస్టెంట్ జాహేద్ ఉన్నారు.

## తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలపై అవగాహన



**వరంగల్ వాయిస్, కేయూ :** ఈనెల 19 నుంచి నవంబర్ 9, 2023 వరకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతి ద్వారా తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ ఆరుగురు సభ్యుల ఎన్నికల కోసం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్, కాకతీయ యూనివర్సిటీ వరంగల్ ఆడిటోరియంలో డీన్ ప్రొఫెసర్ వై.నరసింహ రెడ్డి ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రొఫెసర్ కృష్ణవేణి, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు గుండమీది కోటేశ్వరరావు హాజరై ఎన్నికల విధి విధానాలను విశదీకరించి మాట్లాడుతూ రిజిస్టర్ పోస్టు ద్వారా వచ్చిన బ్యాలెట్ పేపర్ ను నింపిన తర్వాత, మళ్లీ రిజిస్టర్ పోస్టులో కౌన్సిల్ అడ్రస్ కు నవంబర్ 9వ, 2023 సాయంత్రం 5గంటల వరకు అందేటట్లు పంపాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా బ్యాలెట్ పేపర్లు ఇతరుల చేతిలో పెట్టొద్దని తెలిపారు. దీనివల్ల క్రిమినల్ కేసులతో పాటు,రిజిస్ట్రేషన్ కూడా క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఫార్మసీ ప్రొఫెషనల్ అభివృద్ధికై మీ ఓటును వృధా చేయకుండా, తప్పకుండా ఓటింగ్ లో పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు. ఈ అవగాహన సదస్సులో ప్రొఫెసర్ వై.నరసింహ రెడ్డి, ప్రొఫెసర్ స్సమ్మయ్య, ఆరోగ్య ఫార్మసీ ఎండీ డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి

### సీపీఎం సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతన ఆహార భద్రత కార్డులను వెంటనే మంజూరు చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు సీపీఎం హన్మకొండ జిల్లా కమిటీ సభ్యులు, సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ అన్నారు. బుధవారం రాంనగర్, సీపీఎం జిల్లా కార్యాలయంలో సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి నూతన రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేస్తుందని మండిపడ్డారు. గృహలక్ష్మి పథకానికి అర్హతగా రేషన్ కార్డు పెట్టడం వల్ల చాలా మంది అర్హులు, అర్హత కోల్పోయారన్నారు. అలాగే కొత్తగా పెళ్లిళ్లు అయిన వారు వారి కుటుంబం రేషన్ కార్డు నుంచి వారి పేర్ల ను తొలగించుకొని కొత్త కార్డు అప్లికేషన్ కోసం దరఖాస్తు చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. మహిళ సంఘం గ్రూప్ లో ఉండాలన్న, డబుల్ బెడ్ రూమ్ కు, ఆరోగ్య శ్రీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో అర్హులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ వస్తున్న క్రమంలో నూతన రేషన్ కార్డు దరఖాస్తులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలకుంట్ల యకయ్య, నోముల కిషోర్, కంచర్ల కుమరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పులిగిల్లలో బతుకమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు అందిస్తున్న బతుకమ్మ కానుకలను(చీరలు) పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం పులిగిల్లలో గ్రామ సర్పంచ్ పాలకుర్తి సదానందం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు బోజ కిషోర్ రెడ్డి, గజ్జి రాధ-కైలాసం, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింగం, గ్రామ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఏవో అత్తే సుధాకర్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి డీలర్లు నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు ఉంటాయని తెలిపారు. ఏఈవో దుర్గా ప్రసాద్, షాపుల యజమానులు పాల్గొన్నారు.

## కాజీపేట బస్టాండ్ నిర్మాణం కళేనా..



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాజీపేట ప్రాంతం రైల్వే పరంగా, దాదాపుగా స్లమ్ ఏరియాతో ఉన్నటువంటి ప్రజానీకం ఉంటారని, ఇక్కడ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే హడావుడి ఆర్భాటలు చేయడం ఓట్లు దండుకొని కాజీపేట అభివృద్ధిని విస్మరించడం ప్రభుత్వచీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ కుటుంబానికి అలవాటుగా మారిపోయిందని నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో మున్సిపల్ కమిషనర్ ఫోర్జరీ సంతకం చేసి సుమారు రెండున్నర కోట్లకు పైగా ప్రజాధనాన్ని అవకతవకలకు పాల్పడి దుర్వినియోగం చేసిన అధికారిని రాత్రికి రాత్రే గుట్టు చప్పుడు కాకుండా తెల్లవారే సరికే అరెస్టు చేసి రిమాండ్ చేయడం వెనుక ఉన్న రహస్యం బయటపెట్టాలన్నారు. వారి వెనుక స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందని నాయిని రాజేందర్రెడ్డి ఆరోపిస్తూ పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ పీహెచ్డీ సీట్ల కేటాయింపు లో అవకతవకలు జరిగాయని, యూనివర్సిటీ విద్యార్థుల హాస్టల్ సౌకర్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, గత 28 రోజులుగా విద్యార్థులు ఆందోళనలు, నిరసనలు చేస్తుంటే తెలంగాణ ఉద్యమంలో యూనివర్సిటీ విద్యార్థులను రెచ్చగొట్టి, వాడుకొని వారి సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ జవాబు చెప్పాలని, వెంటనే విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్లో గత సంవత్సరం వర్షాకాలంలో వరద బాధితులకు సహాయం చేస్తానని కార్పొరేషన్ ఎన్నికల ముందు ఎన్నికల కోడ్ ఉన్నదని కుటుంబానికి పదివేల చొప్పున ఎన్నికల తర్వాత ఇస్తానని నేటి వరకు మొండిచేయి చూపించి ఇటీవల వరదల్లో నష్టపోయిన బాధితులకు కూడా ఎలాంటి సహాయ సహకారాలు అందించని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగరానికి ఏ ముఖం పెట్టుకొని వస్తారని కాజీపేట బస్టాండ్ ఏమైందో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీ ఆనంద్, ఎంవీ సమత రాజు, ఆరూరి సాంబయ్య, ఇప్ప శ్రీకాంత్, బుర్ర బాబురావు, కే సమ్మయ్య, డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్, పాలడుగుల ఆంజనేయులు పోగుల సంతోష్, క్రాంతి భరత్, రంగు సుధీర్, బొల్లేపల్లి శేఖర్, మహమ్మద్ రఫీ, జక్కుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకమైనదని, ఉద్యమంలో పాల్గొన్న మహిళలను గౌరవించుకునేందుకే బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. మండలంలోని సూర్యనాయక్ తండ, సాధనపల్లి, రాజుపల్లి, కాట్రపల్లి, నూర్జహాన్ పల్లి, నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, ప్రగతి సింగారం, పత్తిపాక, హుస్సేన్ పల్లి, శాయంపేట, ఆరెపల్లి, మాందారిపేట, కొత్త గట్టు సింగారం గ్రామాల మహిళామణులకు బుధవారం బతుకమ్మ చీరలు బతుకమ్మ పండుగ కానుక అందించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలకు వెలకట్టకూడదని, చీరలు గౌరవానికి ప్రతీకలని తెలిపారు. పార్టీలకతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 18సంవత్సరాలు నిండిన ఆడబిడ్డలందరికీ తెలంగాణ ప్రభుత్వం కానుకగా, మరమగ్గ నేతన్నలకు ఉపాధి కల్పించటంతో పాటు ఆడపడుచులకు చిరుకానుక అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మాజీ వైస్ ఎంపీపీ వంగల నారాయణరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ దైనంపెల్లి సుమన్, వైస్ చైర్మన్ నందం, మండల ప్రజాప్రతినిధుల, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఆశాల సమస్యలను పరిష్కరించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు ముఖ్యమంత్రి వైఖరికి నిరసనగా బుధవారం హనుమకొండ చౌరస్తాలో భిక్షాటన చేశారు. ముఖ్యమంత్రి వేతనాలు పెంచమని అడిగితే పెంచకుండా ఆశాలతో వెట్టిచాకిరి చేయిస్తున్నాడని, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి ప్రజలకు ఆరోగ్య సూత్రాలని ప్రభుత్వ పథకాలని చేరవేస్తున్న ఆశలకు పారితోషికాలు మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. లేప్రసి టీబి కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని, లేకుంటే రాబోవు కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రమేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు సీహెచ్ శ్రీవాణి, సుభాషిని, కరుణలత, రాణి, ఈసంపెల్లి శోభ, సింగరపు రమ, వజ్ర, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏనుగల్లులో రూ.12కోట్ల నిధులతో జరిగే అభివృద్ధి పనులకు బుధవారం ఏనుగల్లు ముద్దుబిడ్డ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తక్కలపల్లి నారాయణరావు, భాస్కర రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్నే రవీందర్, విచ్చేసిన అతిరథ మహారాజులకు బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. అలాగే మండలంలో మేర కులస్తులకు కమిటీ హాల్ కు నిధులు మంజూరు చేయాలని, మేర కులస్తులు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్ణ భిక్షపతి, పోరిశెట్టి లక్ష్మీనారాయణ, పెండ్యాల సత్యనారాయణ, పొడి శెట్టి భాస్కర్, పొడి చెట్టి చేరాలు, పెండ్యాల రవి, పొడి శెట్టి దేవేందర్, పొడిశెట్టి యాకయ్య, మహిళలు, మేరుకులస్తులు పాల్గొన్నారు.

## ముదిరాజుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మత్స్యకారులను ఆర్థిక అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో 12లక్షల చేప పిల్లలను మొదటి విడతగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆ చేప పిల్లను రిజర్వాయర్ లో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజులు ఈ చేపలను పట్టడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం లక్ష్యం చేపలను వేటాడే సందర్భంలో ప్రమాదం జరిగితే వారికి ప్రమాద బీమాను ఐదు లక్షల బీమా కల్పించింది. మత్స్యకారులకు మార్కెట్లకు రవాణా సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి చెందే విధంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ, ధర్మసాగర్ మత్స్యశాఖ అధ్యక్షుడు మెడబోన సుధాకర్, ముపారపు అశోక్, కుదిరిపాక శీను, రాయిల్లా శేఖర్, రాళ్ల సాంబరాజు, ఎంపీటీసీలు బోడ్డు శోభ, రోండి రాజు, ముదిరాజులు తదితరులు పాల్గొన్నారు.

## బొడ్డెమ్మ ఆడిన మధ్యాహ్న భోజన కార్మికులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వెట్టి చాకిరీ చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర సమితి సభ్యురాలు గడ్డం లలిత కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె 15రోజులకు చేరుకున్న సందర్భంగా ఏకశిలా పార్క్ వద్ద బుధవారం బొడ్డెమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షులు ధర్మల రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు గడ్డం లలిత మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వంట కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, సమ్మె చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఐలయ్య, కవిత స్వరూప, మస్తాన్, బి.పద్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీస్సులు ఉండాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల విజయభేరి సభలో సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలను ప్రకటించిన నేపథ్యంలో బుధవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ఇంటికి వెళ్తూ కాంగ్రెస్ పార్టీ పథకాలైన గృహ లక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, యువ వికాసం, చేయూత 6 గ్యారెంటీ పథకాలను మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్ పార్టీకి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామంలో బుధవారం ఆశలు చేస్తున్న సమ్మెకు అనుకూలంగా మద్దతు తెలుపుతూ పండ్లు పంపిణీ చేస్తు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు, మాజీ ఎంపీటీసీ గణబోయిన కొంరయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆదరి రవీందర్, రమేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా 18సంవత్సరాలు నిండిన మహిళలకు ఇస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బుధవారం ప్రారంభమైంది. మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామ పంచాయతీ అవరణలో జరిగిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నరసింహ మూర్తి, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి పాల్గొని లబ్ధిదారులకు చీరలు పంపిణీ చేశారు.

## కేయూ వీసీ, రిజిస్ట్రార్లను అరెస్ట్ చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పీహెచ్ డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని వెంటనే వీసీ, రిజిస్ట్రార్లను అరెస్ట్ చేయాలని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి పవన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 26 రోజుల నుంచి విద్యార్థులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దీక్ష చేస్తున్నప్పటికీ కూడా ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదన్నారు. కేయూలో అక్రమంగా పీహెచ్ డీలను అమ్ముకున్న వీసీ, రిజిస్ట్రార్లను అరెస్ట్ చేసి విచారణ జరిపించాలని, ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కేయూలో దీక్ష చేస్తున్న విద్యార్థులకు బీసీ యువజన సంఘం అండగా ఉంటుందని, అలాగే వాళ్లకు న్యాయం జరిగే వరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటామని తెలిపారు. బీసీ యువజన నాయకులు నీలా సాయి, రాజు, కరణ్, బబ్లు, శివ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 04, అక్టోబర్ 2023




## ఇప్పుడిదే తలనొప్పిగా మారింది..

నటి నయనతార ఇటీవల తల సొంత స్కిన్‌కేర్ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. 9 స్కిన్ పేరుతో మొదలు పెట్టిన ఈ వ్యాపారానికి సంబంధించిన వివరాలను గత వారం సోషల్ మీడియా వేదికగా తన అభిమానులతో పంచుకుంది. అయితే ఇప్పుడిదే నయనకు తలనొప్పిగా మారింది. ఈ బ్రాండ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో ఆమెకు తీవ్ర నెగిటివిటీ ఎదుర్కోవాల్సి వచ్చింది. కొంతమంది నెటిజన్లు నయనతారను ట్రోల్ చేస్తున్నారు. 9స్కిన్ ప్రమోషన్స్‌లో భాగంగా నయనతార ఫొటో షూట్ ఇప్పుడు వివాదానికి కారణంగా మారింది. స్కిన్ కేర్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే సమయంలో అంత మేకప్ వేసుకోవడం అవసరమా.? అంటూ కొందరు నెటిజన్లు కామెంట్స్ చేశారు. నయనతార బ్రాండ్ కంటే తనను తాను ఎక్కువగా ప్రమోట్ చేసుకునేలా ఫొటో ఉందంటూ మరో యూజర్ స్పందించారు. ఇక మరో యూజర్ స్పందిస్తూ మీరు మేకప్ వేసుకోకుండా బ్రాండ్‌ను ప్రచారం చేయలేరా.? అని ప్రశ్నించాడు. ఏది ఏమైనా నయనతార కొత్త బ్రాండ్ లాంచింగ్ ఈ బ్యూటీకి అనుకోని తలనొప్పి తెచ్చి పెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉంటే నయనతార కెరీర్ విషయానికొస్తే ఈ బ్యూటీ ప్రస్తుతం ఇరైవన్ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది.

## పాన్ ఇండియా లెవెల్లో ..



స్టువర్టుపురం గజదొంగగా తెలుగు రాష్ట్రాలను ముప్పు తిప్పలు పెట్టిన వారిలో టైగర్ నాగేశ్వరరావు కూడా ఒకరు. ఈయన పేరు ఇప్పటికీ అక్కడక్కడ వినిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు అదే పేరుతో హీరో రవితేజ ప్రేక్షకుల ముందుకు త్వరలోనే రాబోతున్నారు. డైరెక్టర్ వంశీ కృష్ణ చాలా కష్టపడి స్క్రిప్ట్ వర్క్ చేసి మరి ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన పలు రకాల పోస్టర్స్ టీజర్ ప్రేక్షకులను బాగా ఆసక్తిని పెంచేసాయి.. ఈ రోజున ఈ సినిమా ట్రైలర్ కొన్ని గంటల ముందు విడుదల కావడం జరిగింది. రవితేజ కెరియర్ లోనే అత్యధిక భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా స్థాయికి తగ్గట్టుగా ఈ సినిమా రిలీజ్ కాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ పైన నిర్మిస్తూ ఉన్నారు. ఈ రోజున ముంబైలో జరిగిన ఒక ఈవెంట్లో ఈ సినిమా ట్రైలర్ ని రిలీజ్ చేశారు .ఇప్పటికే ఈ సినిమా పైన పాజిటివ్ బజ్ క్రియేట్ అవుతోంది. కొన్ని దశాబ్దాల క్రితమే స్టువర్టపురం అనే దొంగలు ఎక్కువగా ఉన్నట్లు వార్తలు వినిపించేవి అక్కడ ఎలాంటి లూటీ చేయాలన్న ముందు ఏరియాలలో వేలం పాట పడేవిధంగా ఈ సినిమా ట్రైలర్లు చూపించారు ఆ విధంగా దొంగలలో అతి భయంకరంగా పేరు సంపాదించుకున్న టైగర్ నాగేశ్వరరావు కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నాగేశ్వరరావు చుట్టూ కుట్రలో కారణంగా జైలుకు వెళ్లడం ఆ తర్వాత తప్పించుకొని రావడం ఇలాంటి అంశాలు ఈ ట్రైలర్లు చూపించారు. చివరికి అతని కనెక్షన్ సీఎం పీఎం లెవెల్స్ లో ఉన్నట్టుగా ఈ ట్రైలర్లో చూపించారు. మరి ఈ కథ ఏ మేరకు అభిమానులను ఆకట్టుకుంటుందో చూడాలి మరి టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించిన డైరెక్టర్ వంశి సక్సెస్ అవుతారేమో చూడాలి ఇందులో రేణు దేశాయ్ స్పెషల్ పాత్రలు నటించింది అలాగే అనుపమ్ ఖేర్ కూడా నటించారు. అక్టోబర్ 20 తేదీన పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కాబోతోంది.


## దారుణంగా పడిపోతుంది

కంగన రనౌత్ పని అయిపోయిందా..? ఇక ఆమె కెరీర్ ఖతమ్ అయినట్లేనా..? ఒకప్పుడు వరస విజయాలతో స్టార్ హీరోలకు కూడా వణుకు పుట్టించిన ఈ బ్యూటీ కెరీర్‌కు ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసిందా..? అసలు కంగనా మళ్లీ కమ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉందా..? వరస డిజాస్టర్స్ మధ్య కాంట్రవర్సీ క్వీన్ మళ్లీ నిలబడుతుందా..? అసలేం జరుగుతుంది కంగనా కెరీర్‌లో..? కంగనా రనౌత్.. ఈ పేరుకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకటి రెండు కాదు ఏకంగా 4 నేషనల్ అవార్డులు అందుకుని ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నారు కంగన. లేడీ సూపర్ స్టార్‌గా వరస విజయాల్లో ఉన్న కంగనకు కొన్నేళ్లుగా టైమ్ అస్సలు కలిసి రావట్లేదు. భారీ ఆశలు పెట్టుకున్న తలైవి, ధాకడ్, చంద్రముఖి 2 నిరాశ పరిచాయి. ఈ మధ్యే వచ్చిన చంద్రముఖి 2 సైతం నిరాశ పరిచింది. ఇటు సౌత్.. అటు నార్త్.. రెండో చోట్లా కంగనా చిత్రాలు ఆకట్టుకోవడం లేదు. దాంతో కంగనా మార్కెట్ దారుణంగా పడిపోతుంది. ఇప్పటికప్పుడు హిట్ కొట్టకపోతే ఈ భామ కెరీర్‌కి ఎక్స్‌పైరీ డేట్ వచ్చేస్తుంది. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ తేజస్‌పైనే ఉన్నాయి.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ తేజస్ గిల్‌గా ఇందులో నటిస్తున్నారు కంగన. దేశం కోసం పోరాడే ఎయిర్ ఫోర్స్ ఉద్యోగిగా కంగన నటిస్తున్నారు. అక్టోబర్ 8న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా ట్రైలర్ విడుదల చేయనున్నారు. ఈ తో కంగన మళ్లీ ఫామ్‌లోకి వస్తుందని ఆశిస్తున్నారు ఫ్యాన్స్. అక్టోబర్ 20న విడుదల చేయాలి అనుకున్నా.. అదే రోజు టైగర్ ష్రాఫ్ గణపత్ ఉండటంతో 27కి వాయిదా వేసుకున్నారు. చూడాలిక.. ఈ అయినా కంగనా కష్టాలు తీరుస్తుందో లేదో..?



## త్వరలోనే క్లారిటీ..





బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ టైగర్ ఫ్రాంఛైజీలో నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ సెట్ చేశాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే జోనర్‌లో వస్తున్న తాజా చిత్రం 'టైగర్ 3'. మనీశ్ శర్మ దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ భామ కత్రినాకైఫ్ హీరోయిన్‌గా నటిస్తోంది. షారుఖ్ ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్టు ఇప్పటివరకున్న అప్‌డేట్. అయితే మేకర్స్ విడుదల తేదీ ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్‌లో పెడుతూ వస్తున్నారు. కాగా 'టైగర్ 3' విడుదల తేదీపై త్వరలోనే క్లారిటీ ఇవ్వబోతున్నారు.. వెయిట్ చేయండి.. అని ట్రేడ్ ఎనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. పులి గాయపడింది.. అని ట్వీట్‌తో కొన్ని రోజుల క్రితం 'టైగర్ 3' అప్‌డేట్ అందించి అభిమానులను ఖుషీ చేశాడు సల్లూభాయ్. దేశభక్తి ప్రధాన ఇతివృత్తంతో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో కూడా విడుదల చేసేందుకు యశ్ రాజ్ ఫిలిం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, అనుప్రియా గోయెంకా, రిద్ధి డోగ్రా, అంగద్ బేడి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలనాటి అందాల తార రేవతి చాలా కాలం తర్వాత మరోసారి స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో కలిసి సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. టైగర్ ఫ్రాంఛైజీలో ఏక్తా టైగర్, టైగర్ జిందా హై తర్వాత వస్తున్న సినిమా కావడంతో 'టైగర్ 3'పై అంచనాలు భారీగా ఉన్నాయి.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బీఆర్ ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం పాలకుర్తి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం తొర్రూరు మండలం గుర్తూరులో ఆకేరు వాగుపై చెక్ డాం నిర్మాణానికి, గుర్తూరు-ఎర్రబెల్లి గూడెం రోడ్డులో బ్రిడ్జి పనులు, గ్రామంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. వాగులు వంకలపై చెక్ డ్యాములు కట్టి నీటిని వృథా కాకుండా ఆపి భూగర్భ జలాలను పెంచామన్నారు. రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, రుణమాఫీ, రైతు వేదికలు, రైతు కల్లాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రతి ఎకరాకు సాగునీరు, మిషన్ భగీరథ, సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువలు, తారు రోడ్లు, అంతర్గత రోడ్లు, అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన సంక్షేమ ప్రభుత్వం సీఎం కేసీఆర్ దని కొనియాడారు. సబ్బండ కులాల కులవృత్తుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామ ప్రజలు మంత్రికి బతుకమ్మలతో డప్పు వాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా ఘనంగా స్వాగతం పలికారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు, మహిళలు, యువత, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దమ్ముంటే కేయూలో పర్యటించాలి

## మంత్రి కేటీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి సవాల్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని ప్రధాన సమస్యలపై గతంలోనే 30 ప్రశ్నలు సంధిస్తే ఇప్పటివరకు ఒక్కదానికి కూడా కేటీఆర్ నుంచి సమాధానం రాలేదని, వచ్చినప్పుడల్లా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు తప్పా ఓరుగల్లును పట్టి పీడిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. ఈ నెల 6 వ తేదీన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బుధవారం రాకేష్ రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేటీఆర్ కు దమ్ముంటే కాకతీయ యూనివర్సిటీలో పర్యటించాలని సవాల్ విసిరారు. పీహెచ్ డీలో జరిగిన అక్రమాలపై విద్యార్థి నాయకులు గత 20 రోజులుగా నిరసన తెలుపుతుంటే ఉలుకూ పలుకూలేని కేటీఆర్ గప్పాలు కొట్టుకుంటూ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. మోడీవి అబ్బదాలు అంటున్న ఆత్మావలోకనం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం పూర్తి అవినీతి మయం అన్నది అబద్ధమా? లక్ష ఉద్యోగాల హామీ అబద్ధం కాదా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ హామీ అబద్ధం కాదా, రైతులకు లక్ష రుణ మాఫీ అబద్ధం కాదా అని ప్రశ్నించారు. ఇలా మీరు చెప్పేవన్నీ అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేస్తూ మమ్మల్ని అబద్ధం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# ఐక్యత కాపాడుకుందాం..

## పలువురు వక్తల అభిప్రాయం

## ఘనంగా ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మీడియా రంగంలో తమ ఐక్యత కాపాడుకోవడంతోపాటు హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భవించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం వేదికగా హనుమకొండలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో జిల్లాలోని వివిధ జర్నలిస్ట్ సంఘాలు, వివిధ పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులు, నాయకులు హాజరై మీడియా రంగంలో వస్తున్న నూతన పోకడలుతో ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులు తమ హక్కులు సాధించుకోవడం, ఐక్యతను చాటుకోవడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలంగాణ ప్రింట్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొల్లా కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలో నిర్వహించిన ఈ సన్నాహక సమావేశంలో కో కన్వీనర్లు కంకణాల సంతోష్, కట్కూరి రవికుమార్, ఊటుకూరు సాయిరాం, బొమ్మగాని ఆదర్శ్, అల్వాల సదాశివుడు, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు, సంఘాల నాయకులు మాట్లాడుతూ మీడియా రంగంలో ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఉనికి కష్టతరంగా మారుతుందని ఇలాంటి తరుణంలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు ఐక్యంగా అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏర్పాటైన నూతన ప్రింట్ మీడియా అసోసియేషన్ ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న ఏ రాష్ట్ర యూనియన్ కి ఇతర జర్నలిస్టు సంఘాలకు వ్యతిరేకం కాదని అదేవిధంగా అనుబంధ సంఘం కూడా కాదని అడహాక్ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. త్వరలో సభ్యత్వ కార్యక్రమం పూర్తి చేసుకుని అన్ని జిల్లాల్లో సంఘాన్ని విస్తరించడం మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయడం తమ లక్ష్యం అని తెలిపారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో ప్రంట్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. నూతనంగా ఆవిర్భవించిన అసోసియేషన్ ను జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పలువురు సీనియర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

# టెంపుల్ టూరిజంగా ఓరుగల్లు

## మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

## విలేకరుల సమావేశంలో వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టెంపుల్ టూరిజంగా వరంగల్ నగరం రూపొందనుందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతతోనే తెలంగాణ అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన మంత్రి కేటీఆర్ నగరానికి రానున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సుమారు రూ.900 కోట్లతో చేపట్టిన పనుల ప్రారంభంతోపాటు మరికొన్ని శంకుస్థాపనలు ఉంటాయన్నారు. అనంతరం ఆర్టీసీ మాడల్ బస్ స్టేషన్ కు శంకుస్థాపన చేయడంతోపాటు కుడా గ్రౌండ్స్ లో కార్యకర్తలతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బీజేపీ చిల్లర రాజకీయం చేస్తుందని విమర్శించారు. ప్రజలని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీకి తెలంగాణ ప్రజలపై ప్రేమ ఉంటే విభజన హామీలు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఓడిపోతారన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ కేటీఆర్ పై మోడీ వ్యాఖ్యలు సరికావన్నారు. దేశ ప్రజలంతా రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్లు గల్లంతు అవుతాయన్నారు. ఆ పార్టీలకు ప్రజలు బుద్ది చెప్పే రోజులు దగ్గర పడ్డాయాన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరల పంపిణీ

## కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్, మేయర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి పండుగ కానుక బతుకమ్మ చీర అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బల్దియా పరిధి 29 వ డివిజన్ లో బుధవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ మునిసిపల్ కమ్యూనిటీ హాల్ లో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి చీఫ్ విప్ ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి లబ్ధిదారులకు చీరలు అందజేశారు. అనంతరం చీఫ్ విప్ మాట్లాడుతూ ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను అందజేస్తున్నారని, స్వీకరించి ఆదరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఆడబిడ్డల ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపజేసెలా ప్రతి ఏటా బతుకమ్మ పండగ సందర్భంగా చీరలు అందజేయడాన్ని సంప్రదాయంగా కొనసాగించడం జరుగుతుందన్నారు. వివిధ రంగుల్లో అతివల మెప్పు పొందేలా 27 రకాల రంగులతో 25 రకాల డిజైన్లలో ఆకర్షణీయంగా తయారు చేసి అందజేస్తున్నట్లు వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తుపెట్టుకొని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, టీఎంసీ.రమేష్, సీఓలు రజిత, రాజ్ కుమార్ తో పాటు టీఎన్ జీఓ అధ్యక్షులు ఆకుల రాజేందర్, స్థానిక నాయకులు సదాంత్, షఫీ, పూజారి కుమార స్వామి, రాచర్ల జగన్, గట్టు చందు, నక్క జ్యోతి, రాధిక, పరశు రాములు, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని జయగిరి గ్రామంలో తుమ్మల రాజు హత్య కేసులో ఐదుగురుని అరెస్టు చేశామని ఏసీపీ డేవిడ్ రాజ్ వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హసన్ పర్తి మండల సోషల్ మీడియా ఇంచార్జిగా వ్యవహరిస్తున్న మడిపల్లి గ్రామానికి చెందిన తుమ్మల రాజు అనంతసాగర్ గ్రామానికి చెందిన కుమారస్వామి మనుమరాలిని వేధింపులకు గురి చేశారు. దీంతో కక్ష పెంచుకున్న కుమారస్వామి తన సహచరులు శివకుమార్, ఎల్లబోయిన అనిల్, సంజీవ్ లతో కలిసి తుమ్మల రాజును హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. గత నెల 30న సాయంత్రం తుమ్మల రాజు అనంతసాగర్ గ్రామంలో తిరుగుచుండగా కుమారస్వామి భార్య కేతమ్మ చూసి మిగతా వారిని పురమాయించింది. దీంతో కుమారస్వామితోపాటు అతని బామ్మర్ది అనిల్, కుమారస్వామి కొడుకు శివకుమార్ విచక్షణారహితంగా దాడి చేయడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందారు. ఎవరికి అనుమానం రాకుండా రాజు మృత దేహాన్ని తాళ్లతో కట్టి ఆటోలో తీసుకెళ్లి జయగిరి సమీపంలోని ఎస్ ఆర్ ఎస్ పీ కాలువలో పడేశారు. తుమ్మల రాజు భార్య తుమ్మల రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలించగా వర్ధన్నపేట కాట్రియల్ గ్రామం కెనాల్ లో రాజు మృతదేహం లభించింది. రాజును హత్య చేసిన బైకానీ కుమారస్వామి, శివకుమార్, ఎల్ల బోయిన అనిల్, బై కానీ కేతమ్మ, మామిండ్ల సంజీవ్ లను అరెస్టు చేసి హత్యకు వాడిన ఆటో, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డేవిడ్ రాజ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ తుమ్మ గోపి, ఎస్సై అశోక్, ఎస్సై సురేష్, విద్యాసాగర్, క్రైమ్ కానిస్టేబుల్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com